# ఐతే ఆమె నాకు కావాలి

—నా వం

"అమ్మ బాబోయ్! అసలు విషయం తెలిసింది. నా కొద్దీ పెళ్ళి."

"అమ్మా! నాన్నగారితో చెప్పవే, నాకీ పెళ్ళొద్దు"

"అదేమిటిరా? నిక్షేపం లాంటి పిల్ల...."

"పిల్లగాదే తల్లీ! అదొక దయ్యం"

గజ గజ లాడుతూ, గట్టిగా చెప్తున్నాడు శంభులింగం — పార్వతమ్మగారికి మతి పోయింది. తన సుపుత్రు డెందుకలా అంటున్నాడో అర్థంకాక కళ్ళప్పగించిచూస్తోంది. —

లగ్న సమయం దగ్గర కొస్తోంది, బయట మేళ తాళాల ధ్వని. విడిదింట్లో పకపే సందడి—

"పెండ్లి కొడుకును తీసుకురండి, ఆలస్యమైతే లగ్నం కాస్తా తప్పిపోతుంది." పెండ్లి పెద్దల పిలుపులు—

"ఇంకా ఏంచేస్తున్నాడా గదిలో? వెంటనే బయలుదేరమను"

శివస్వామిగారి ఆజ్ఞ.—

భర్తగారి ఆజ్ఞ చెవిలో దూరినా, పార్వతమ్మగారి బుర్ర మాత్రం పని చేయడం లేదు. ఇటు కొడుకును, అటు భర్తను మార్చి, మార్చి చూస్తోంది —

"అలా చూస్తావేం? నీకేమైనా దయ్యం పట్టిందా?"

"నాకేం పట్టలా, అబ్బాయి నేదో ఆవహించినట్లుంది" పార్వతమ్మ జవాబు.—

"నాన్నగారూ! నాకీ పెళ్ళొద్దు. పెళ్ళికూతు రొక దయ్యం. ఆడపిల్లకాదు".

ఖచ్చితంగా చెప్పేశాడు శంభులింగం.

"నోర్ముయ్. ఏమిట్రా ఆ మాటలు? అంచక్కని అమ్మాయిని పట్టుకుని దయ్యమంటావేమిట్రా?" గదమాయించాడు శివస్వామి.

"దయ్యమే నాన్నా! మీకు తెలియదు. దయ్యం కాకపోతే — నాల్గు కన్బొమలు, ఏడు విశాల నేత్రము లెక్కడైనా వుంటాయా?"

విషయమేమిటో, శివస్వామి కర్థంగావటం లేదు. తన కొడుకలా మాట్లాడ్డానికి కారణమేమిటా? అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో శంభులింగానికి శశిరేఖా పరిణయం గుర్తుకొచ్చింది. ఏదో రాక్షసి, పెళ్ళికూతురుగా వచ్చి కూర్చుంటుందనే నమ్మకం కలిగింది. ఘటోత్కచుని మాయ, లక్ష్మణ కుమారుని అవస్థ, గుర్తుకు రాగానే దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ, "రాక్షసి, రాక్షసి" అంటూ గొణగడం ప్రారంభించాడు.—

పెళ్ళి కొచ్చిన వారిలో గుస గుసలు బయలుదేరాయి. ఒకరి చెవు లొకరు కొరుక్కున్నారు.

"అసలు వీడినే ఏదో దయ్యం పట్టినట్టుంది" అన్నాడొక పెద్దమనిషి.

"దయ్యమూ లేదు. మట్టి గడ్డా లేదు. అసలు విషయం వేరే వుందిలే" అంటూ తన కేదో రహస్యం తెలిసినట్లుగా పోజు పెట్టాడు మరో పెద్ద మనిషి.—

"ఏమిటా అసలు విషయం?"—

"ఏమిటా?"

"డీ!"

"ఏముంది? ఎక్కువ కట్నం గుంజడానికి, శివస్వామి వేసిన ఎత్తు, తెలిసిందా?"

"ఏమిటీ గోల, కట్నాలు, కానుకలు మాట్లాడుకున్న తరువాతే గదండీ తాంబూలాలు పుచ్చుకున్నారు?" ఒక ముత్తైదువ వెలిబుచ్చిన సందేహం.—

"అయితే మాత్రం, డబ్బు చేడటప్పా? వచ్చినంతవరకూ గుంజడాని కిదో ఎత్తు" మరో ఇల్లాలి సమాధానం.

"అమ్మాయి అతిలోక సౌందర్యవతి




అని పార్వతమ్మ తెగమురిసి పోయిందిగా ! హాయిగా పెళ్ళి చేసుకోక, మధ్యలో ఈ గోలేమిటి !"—

"అందం కొరుక్కు తింటారటమ్మా ! డబ్బుంటే, పుచ్చెగాస్తుంది"

ఎవరికి తోచిందివారు, ఎవరి తత్వాన్ని బట్టివారు, తలా ఒక విధంగా చెప్పుకోవ డమేగాని, పెండ్లి కొడుకును నిగ్గదీసి, అసలు విషయమేమిటో కనుక్కున్న వాళ్ళులేరు.—

విడిదిలో వార్తలు బజారులోకి – బజారు వార్తలు పెళ్ళి వారింటికి పాకాయి. పెండ్లి కుమార్తె సోదరుడు వీరభద్రం ఉగ్రుడై పోయాడు. విషయమేదో ! తేల్చుకోవాలని విడిదింటి కొచ్చాడు.—

వీరభద్రం వెంట మరో పదిమంది యువ కులు. అందరి చేతుల్లోనూ బడితెలు.

"పిల్ల మెడలో సూత్రం కట్టక పోతే ప్రాణాలు తీస్తాం" అంటూ యువకుల బెది రింపులు—

మగపెళ్ళి వారినోటి వెంట మాటరాలేదు' కిక్కురుమంటే, తంతారేమోనని ముడుచుకు కూర్చున్నారు.

పాపం! ఇంతలో పెళ్ళివారి అదృష్టం పండింది. తాంబూలం సేవిస్తూ. ముసి ముసిగా నవ్వుతూ, కుమారస్వామి ప్రవేశిం చాడు. శంభులింగానికి ప్రాణం లేచి వచ్చింది.

"అడగండి కుమారస్వామిని, ఆ పిల్ల ఎలాంటిదని చెప్పాడో ! వాడినే అడగండి" సవాల్ చేస్తున్నట్లుగా మాట్లాడుతున్నాడు శంభులింగం.—

"ఎరా ! కుమారస్వామి ! అమ్మాయి దయ్యమని చెప్పావా వీడికి" శివస్వామి నిగ్గ దీశాడు.

"దయ్యం అని గాదు. దేవత అని చెప్పాను." అంటూనే కుమారస్వామి పక్కున నవ్వాడు.

అలా నవ్వడానికి కారణమేమిటో ! ఎవ రికీ బోధపడలేదు.

శంభులింగానికి చిర్రెత్తుకొచ్చింది. కుమారస్వామిని కొరకొర జూస్తూ "కన్యకు నాల్గు కన్నామలు, కన్యకు నేడు విశాల నేత్రముల్. అని చెప్పావా ! లేదా ! నిజం చెప్పు" నిలదీసి అడిగాడు.

"అవును, చెప్పాను, నిజమే చెప్పాను" నిశ్చలంగా జవాబిచ్చాడు కుమారస్వామి.—

మరి ఇకనేం ! ఆ అమ్మాయి దయ్యమో ! రాక్షసో ! గాక మరేమిటి !" తన ఊహ సరైనదేననే నమ్మకంతో శంభులింగం వేసిన ప్రశ్న—

"ఓరి వెర్రినాయనా ! నీ వేదో జ్యోతి శ్శాస్త్రంలో ప్రవీణుడవని అలా చెప్పాను. నీ వింత బడుద్ధాయివని తెలిస్తే అలా చెప్ప కనే పోదును. జాతకాలు చూడ్డం నీకు బాగా తెలుసు గదరా !" ఎదురు ప్రశ్నవేశాడు కుమారస్వామి.—

"ఊ ! తెలిస్తే ? దానికీ – దీనికీ సంబంధ మేమిటి ?"

"భూత భవిష్యత్ వర్తమానాలు తెలిసిన దైవజ్ఞుడవు. అలాంటి నీకు ఈ పిల్ల ఎలాంటిదో తెలియలేదటరా ?"

"ఇతరులకు చెప్పడం వేరు. మన విషయాలు మనకు తెలియడం వేరు. పైగా పార్వతీదేవి శాపం వుండనే వుందె" నసి గాడు శంభులింగం.—

"అదా సంగతి ? పోనీ, నక్షత్ర రాసు లెలాంటివో తెలుసుగదా?"—

"ఊ ! తెలుసు."

"కన్యరాశి నుండి, ధనస్సు ఎన్నోరాశి?"

"కన్య, తుల, వృశ్చికం, ధనస్సు— నాలుగోరాశి"

"ఇప్పుడు తెలిసిందా ? "కన్యకు నాల్గు కన్నామలు" అంటే— ధనస్సు వంటి కన్నామలు కలిగిన కన్య అని అర్థం, అవునా ?"

"అవును"

"మరి, కన్యరాశినుండి, మీనం ఎన్నో రాశి ?"

"ఏడవ రాశి"

"కాబట్టి, "కన్యకు నేడు విశాల నేత్ర ముల్" అనగా, ఈ కన్య "మీనలోచన" అని గ్రహించాలి, అవునంటావా ?"

"అవును"

"ఇప్పుడు చూడరా, నేనుచెప్పిన మాటల కర్థమేమిటో ! తిన్నగా అర్థం చేసుకోరా బడుద్ధాయీ !" మందలించాడు కుమార స్వామి.

శంభులింగానికిఅంతావిశదమైపోయింది. తన తెలివి తక్కువకు బాధకలిగినా, తనకు కాబోయే అర్థాంగి సౌందర్యాన్ని తలుచుకుని ఉప్పొంగి పోయాడు. మైమరచిన సంతో షంతో —

"ఐతే, ఆమె నాకు కావాలి, ఆమేనాకు అర్థాంగి కావాలి. క్షమించండి బావగారూ !" అంటూ, గబగబా వెళ్లి వీరభద్రం చేతులు పుచ్చుకుని ప్రాధేయపడ్డాడు.—

★



## ఆరోగ్య నిధి

డా॥ ఎస్. ఆంజనేయులు

## 2. చేతులు కాలాక...

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం లేదన్నది సామెత. ఈ సామెత పోలియో వ్యాధికి వర్తిస్తుంది. ఈ జబ్బు రాకుండా జాగ్రత్త పడ వచ్చుగాని, తీరావచ్చాక ఎన్ని మందులు వాడినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం శూన్యమనే చెప్పాలి.

పోలియో పిల్లలకు వచ్చే అంటు జబ్బులలో ఒకటి. ఈ జబ్బు వల్ల సామాన్యంగా కాళ్ళు సన్నబడతాయి. అవిటితనం ఏర్పడుతుంది. తీరా జబ్బు వచ్చాక ఎన్ని మందులువాడినా అంతగా ఫలితం కనుపించదు. ఇప్పటి వరకు ఈ జబ్బుకు సరయిన మందు రాలేదనే చెప్పాలి. పోలియో వాక్సిన్ యిప్పిస్తే మాత్రం ఈ జబ్బునుండి పిల్లలను తప్పించవచ్చు. ఈ వాక్సిన్ వాడిన తర్వాత పోలియో రాదని ఖచ్చితంగా చెప్పవచ్చు. మూడోనెల వయసు నుండి నెల వ్యవధిలో వరుసగా మూడు సార్లు ఈ వాక్సిన్ వాడాలి. ఈ వాక్సిన్ వల్ల పిల్లలకు జ్వరం వస్తుందని చాలామంది తల్లి దండ్రులు భయపడుతుంటారు. కొందరు పిల్లలకు కొద్దిపాటి వేడి చేయవచ్చు. అయినా భయంకరమయిన పోలియో వ్యాధినుండి కాపాడ్డం కోసం పిల్లలకు తప్పనిసరిగా వాక్సిన్ వేయిం చాలి. పెద్దల అశ్రద్ధ పిల్లల భావి జీవి తాన్ని పాడుచెయ్యగూడదు.